# ఇంకా తెలవారదేమి?



**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech



## ముందుమాట

ప్రతి రచనలోనూ ఏదో వైవిధ్యం కోరుకునే మనస్తత్వం నాది. అన్నీ కంద పద్యాలతో అన్నీ ఆటవెలదులతో, అన్నీ సీసపద్యాలతో అన్నీ తేటగీతులతో అన్ని ఉత్పల, చంపక మాలలతో అన్నీ శార్దూల, మత్తేభ నిక్రీడితాలతో స్తోత్రాలు వ్రాశాను. ఇంగ్లీష్‌లో ఆది శంకరుల ఆత్మ బోధ వ్రాశాను. భగవద్గీత పద్య రచన చేశాను. సుందరకాండ (తులసీదాసుగారిది) అనువదించాను. ఏంచేసినా ఎన్నిచేసినా తృప్తిలేదు.

ఇప్పుడు ఇక్కడ ప్రస్తావించబడుతున్న రచన "ఇంకా తెలవారదేమి?" ఒక కలగూర గంప. దీంట్లో రకరకాలైన పద్య సౌరభాలున్నాయి. ఇదివరలో ఎన్నడో అడపాదడపా కవులు వాడి ఇప్పుడు వాడుకలో లేని మత్తకోకిల వంటి పద్యాలు కూడా వ్రాయాలని నా ఆశ.



విఘ్నములు రాకుండా గణపతిని, సిరిసంపదలు కావాలని శ్రీలక్ష్మిని. చదువు కావాలని సరస్వతిని వేడటం మన హైందవ సంస్కృతి. నేను ఏమాత్రం ఊహించకుండానే ఈ త్రిమూర్తులను ఈ విధంగా సేవించగలిగాను. ఉత్పల చంపకములతో (తెలవారింది తెలివొచ్చిందిలో) గణపతిని, శార్దూలమత్తేభములతో (తెలవారింది దేవరా) శ్రీలక్ష్మిని, ఇప్పుడు ఇక్కడ ఇలా కదంబముగా అన్ని రకాల పద్యాలతో తల్లి సరస్వతిని (ఇంకా తెలవారదేమి) సేవించడం నా జన్మ చరితార్థమయింది. ఇక ఆ పరంధాముడిదే ఆలశ్యం.

మనిషి 3 సూత్రాలు పాటించాలి.

మంచికను, మంచి విను, మంచి అను. దీనిని మించి పరమార్థంలేదు. అణువులోనే ఆ పరమాత్మ ఉన్నాడు



కాబట్టె అణుబాంబుకి ఆ శక్తి. అనంతమైన ఈ ఖగోళం కూడా ఆయనే. నేనిదివరలో చాలాసార్లు చెప్పాను. చీకటంటె అజ్ఞానం. మనం ఎటు వెళ్తున్నామో తెలియదు. ఎప్పుడు పడిపోతామో ఏమవుతుందో తెలియదు. వెలుగే జ్ఞానం. అంతా తెలుస్తుంటుంది.

అట్టి జ్ఞానం కేవలం భగవత్కృపవల్ల కలిగేది. ఇంకో జ్ఞానం మన జీవనోపాధికి కావాలి, అది విద్యవల్ల వస్తుంది. అట్టి విద్య చదువు వల్ల వస్తుంది. అట్టి చదువుల రాణి సరస్వతిని మనం ఆరాధించాలి. అమ్మకోసమే ఈ నాకానుక.

# ప్రార్థన

ఆ॥ శ్రీధరుండు నన్ను చేరి జ్ఞానమునీయ
తెల్లవారు వేళ తెలివివచ్చి
తెలిపినాను ఇన్ని దేవర దయచేత
కాక నేను కవినె కపినిగాక

మ॥ కలిగెన్ సాగరమెట్లు జీవనదులున్
కల్గున్ నిరంతర్గతిన్
వెలుగున్ సూర్యుడు ఎట్లు కాంతి నిడుచున్
వేలాది వర్షంబులున్
నిలుచున్ భూమియు దేనివల్ల తిరుగున్
నీమంబుగా నేళ్ళుగా
తెలియన్ శక్యమె ఊహ చేయుటొకటే
దేవా సదాగావవే



ఆ॥ బ్రతుకు భయము కన్న బాధయా మరణమ్ము
రోజు చచ్చు భీతి రోతకాదె
అయిన వణకుచుందురందరు 'చావన్న'
ఎంత చిత్రమయ్య ఇందిరేశ!

ఉ॥ శ్రీహరి నాకు స్వంతమని చిందులు వేసెను
అమ్మ లక్ష్మి ఆ
శ్రీహరినాదు ప్రాణమని చెందెను ఆగ్రహమట్లె
మంగయున్
శ్రీహరినాదు భర్తయని చెప్పెను ముందరె
భూసతీమణీ
శ్రీహరి నాదుదైవమను శిష్యుల సంగతి
చెప్పనేలరా



# అంకితం

తరళము :

"చదువు సంధ్యలు" లేని నేతల
చాలమందిని చూచితిన్
కొదవలేకను డబ్బులుండియు
కూడునే ఘనకీర్తియున్
యెదను నిల్వుము భారతీ! నను
యెంచి బ్రోవవె తల్లిరో
ముదముతో గొని అంకితమ్మును
ముక్తినీయవె మూఢుకున్



కం॥ కుక్కల తోకల వంకర
చక్కగ సేయంగ కాదు సాధ్యము అట్లే
నిక్కము దుష్టుని బుద్ధిని
మిక్కిలి దుష్కరము దీర్ప మేదిని సత్యా!

ఆ॥ నీవె దిక్కు అనుచు నిను వేడె "గజరాజు"
పట్టెనీదు పదము "పడవవాడు"
పాలుకుడిపి చచ్చె పాపమా పూతన
ఏలరావు నేడు ఏలనన్ను

తే॥ పరశు దాల్చిన కోపికి పత్నిలేదు
రామచంద్రుని కొక్కతే రమణి సీత
వేణు ధరునకు వనితలు వేనవేలు
భార్యనొదిలిన బుధునకు బదులె లేదు

సీ॥ వనితల చనుగవల్ వర్ణించి సొగసుగా
శ్రీనాథుడే మయ్యె శిక్షబొందె
హాలికుండై గూడ హరి వీడ నన్నట్టి
పోతన పోగేసె పుణ్యమంత
రాజ్యంబు పెంపొంద రక్షయై నిలిచిన
తిమ్మరుసంధుడై తిట్టె విధిని
కడగండ్ల కోర్చుచు కాపాడమనివేడు
గోపన్న నిను పొందె గుడిని గట్టి

ఆ॥ ఇన్ని చూచి తెలిసి ఈనాటికైననూ
నిన్ను చూడగలరే నీల్గి నరులు
కాంచనంపు మెరుపు కళ్ళు బైర్లెత్తించ
చిత్తగించవయ్య శ్రీనివాస



ఆ॥ గుడ్లగూబ చూపు గూడదు పగలైన
కాకిరాత్రి వేళ కాంచలేదు
కనడు రేబవళ్ళ కామాంధుడౌవాడు
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

కం॥ సీత వరించిన మగడా
మాతరమా నిన్ను పొగడ మహినెన్నడు, నీ
చేతలు యుగములు అయినా
మాతలపై దాల్తుమయ్య మన్నన రామా.

తే॥ జనని, సోదరి, పుత్రిక శయనమందు
నరులు నిద్రించ కూడదు నేరమగును
మౌనులైనను ఇంద్రియ బానిసలగు
నీతి తప్పుట సాధ్యము నీలవర్ణ!



సీ॥ మూడు గుప్పెళ్ళన్నమడుగు నీదేహంబు
తక్కింది రుచులతో మెక్కు కొరకె
మూడుమూరల బట్టమూయ సిగ్గును చాలు
ఆపైన అందాలు చూపు కొరకె
మూడడుగుల నేల గడుపంగ కావలె
మిగిలింది అందరి మెప్పు కొరకె
మూడు రాత్రులలోనె ముదిత సుఖంబైన
అదిమించి యావయై అదరు కొరకె

తే॥ మూడు నాళ్ళుండు నట్టిదే ముచ్చటైన
మూడు మృత్యువు ఆపైన ముగియునంత
మూడుసార్లైన రోజుకు మొత్తమనుడు
రామ శ్రీరామ రఘురామ రామరామ



సీ॥ అల్లో అనరచెడి అవని ముస్లిములకు
ఆదుకునే అయ్య అదియు నీవె
యెహోవ అనియంచు యోచించు క్రైస్తవ
జ్ఞానికెవ్వడు తండ్రి జగతియందు
జంతువులను కూడ సరి చూడమనియెడి
సాయినాధుండనే జనకుడీవె
మొగమంత నామాలు ముదితల నురముపై
బెట్టిన వెంకన్న వెలయ నీవె

ఆ॥ ఎవరి గొల్చియైన ఎరుగరే మోక్షంబు
చేతినున్న వ్రేళ్ళ శ్రేష్ఠమేది
ఒకటి చెప్పుమన్నయోచనే మూర్ఖంబు
సత్యవాక్కు వినరె జరుగునట్లె

కం॥ ఆకొను కడుపుకు అన్నము
చేకొని అభయమ్ము నిచ్చు జేజేవరయ్యా
మీకింక తెలియ లేదా
ఇంకెవ్వరు వినుడు వేంకటేశుడు వాడే.

ఆ॥ కోరలందు విషము గానకొను సర్పము
కొండెమందు తేలుకుండు, గాని
మనసు విషము నిండు మానవుడే హాని
సత్యవాక్కు వినరె జరుగునట్లె.

ఆ॥ కుంటిజేసినావు అంటినా ఏమైన
ఆవిరయ్యెనాదు ఆశలెల్ల
జంట వీడకయ్య ఒంటరిన్ జేయకు
నల్లరాయి కాకు నల్లనయ్య



సీ॥ కాల్చనే సిరులన్ని కాల్చనే ధనమంత
కాల్చనే కనకంబు కమలనాధ
కాల్చనే భవనాలు కాల్చనే భాగ్యాలు
కాల్చనే భోగాలు కమలనాభ
కాల్చనే చదువులు కాల్చనే పదవులు
కాల్చనే కీర్తియున్ కమలనేత్ర
కాల్చనే చుట్టాలు కాల్చనే హితులెల్ల
కాల్చనే ఆశ్రితుల్ కమలవంద్య

తే॥ కారు మేఘాల మెరుపులు కాంతి క్షణము
ఎండమావుల వెంబడి ఎంతపోను
దారి మళ్ళించవేమయ్య దయను జూపి
ఆర్త రక్షకుడననిదా అరయుమయ్య



ఆ॥ స్త్రీకి స్వేచ్ఛ వలదు చెప్పెను మనువని
తిట్టిరయ్య స్త్రీలు దేశమంత
కోడలమ్మ కాడ విడనేల "స్త్రీ స్వేచ్ఛ"
కూతురట్లు కాదె కోడలమ్మ

ఆ॥ ముక్కుమూసి జపము ముప్పూటలన్ జేయు
గంజిపోయ దొరుల కడుపు నింప
వానికగును గాని వసుధకు మేలౌనె
సత్యవాక్కు వినరె జరుగునట్లె

ఆ॥ తప్పుచేసియైన తన్నెడి వార్లేక
ఇచ్చువచ్చి నిట్లు ఎగిరి పడుచు
మదము తలకు నెక్కిమాయరోగమదేమొ
బెమ్మకైన బుట్టు రిమ్మ తెగులు



సీ॥ ఆలు బిడ్డలనమ్మె ఆ హరిశ్చంద్రుండు
విధి దయ తప్పిన 'వీధి' బడరె
ఆలికోకతొ బారె ఆనాడు నలరాజు
విధి దయమాలిన వెతల గనరె
ఆలికై ఏడ్చెను అడవులన్ రాముండు
విధి దయ చూపక వేరికగును
ఆలికోకను విప్ప అణగిరి పాండవుల్
విధిదయ లేకున్న వేరికగును

తే॥ వారికట్లైన మేమెంత వాసుదేవ
విధిని ఎదిరింప శక్యమే వీలుకాదు
నీదు చరణమే శరణమ్ము నిజము దేవ
చింతనాకేల నీవుండ శ్రీనివాస.

సీ॥ పూల తీగలనుండి పూలను కాజేయు
తేనెటీగల ద్రోలి తేనె దోచు
కట్టేసి కుక్కను కావలి బెట్టును
పంపి దూడను ముందె పాలుదోచు
కాడి కట్టెద్దుల కష్టమునే దోచు
కోడిగుడ్డును దోచి కడుపు నింపు
గుర్రాలు పరుగెత్త కొట్టును దయలేక
గాడిద సంగతి నుడువ వలెనె?

తే॥ తనకు తిండికై, ఇంటికై తరువు గూల్చు
పట్టు పురుగుల శ్రమ దోచు బట్ట కొరకు
మనిషి ఇతరుల శ్రమ దోచు మనుగడకును
కాని, వేదాల వల్లించి ఘనత చూపు



కం॥ తననే తను పొగడెడివా
నిని అందరు సగము చచ్చునీచుడననగా
తన ఆలిని పొగడెడి వా
నిని పూర్తిగ చచ్చెననట నిక్కము రామా

ఆ॥ నిద్ర, భయము, తిండి, నీల్గుడు కామాన
మనిషికూడ జంతువనుట దెలుపు
మంచి చెడుల భేద మెంచుటె ఘనుజేసె
సత్యవాక్కు వినరె జరుగునట్లె.

ఆ॥ చంకనెక్కు బిడ్డ చంకదింపిన నేడ్చు
ఏడ్పుమాన్ప తల్లి ఎత్తుకొనును
అట్టి మంకుతనము ఆడదు నీముందు
అయిన ఏడ్తు స్వామి ఆశపోక



కం॥ పుట్టిన రోజుని మురిసీ
తట్టున యాడంబరమున తగునే నెరపన్
గిట్టుట కొక వత్సరమీ
పట్టున తరుగయ్యె నిజము పలికెద రామా!

శా॥ కావాలన్నను 'పాప' లుండరకటా!
కన్నీటి పర్యంతమై
కావాలన్నను'తిండి' ఉండదరరే!
గగ్గోలు గా ఏడ్చినన్
కావాలన్నను 'నిద్ర' ఉండదవనిన్
గర్వంబుతో నేలినన్
కావాలన్నను చేరడచ్యుతుడు నీ
కర్మంబు పూర్తవ్వకన్



సీ॥ వడ్డివాడని నిన్ను వచియించినందుకే
వడ్డితో జీవించవలసి వచ్చె
నావారలెందరో నాకుండిరని నమ్మి
నిను జూడనైతినె నీల్గినేను
ఏదైన నాకౌను ఎల్లెడనని వీగి
నాను ఓ సర్వేశ నాదెతప్పు
నరముపై పుండుగా నర్తించి ఈరోజు
ఏడ్చిన ఫలమేమి ఇపుడునాకు

ఆ॥ గతము తల్చియేమి కలదయ్య లాభము
గతివి పతివినీవె కర్మ సాక్షి
తప్పు కాయవయ్య తలకాయ నీవెగా
వేంకటాద్రివాస వేంకటేశ

ఆ॥ సంతు సాకలేదు చింతాయె తిండికి
పడతిలేక, లేక పడక సుఖము
'దేవు'డైన గాని 'దేవేరి' కానను౯
సత్యవాక్కు వినరె జరుగునట్లె

కం॥ చేరుచు మాబోట్లిండ్లను
మీరలు మము పలుకరించ మీదయకాదా
ఊరకరారు మహాత్ములు
తీరిది పలుకంగపైకి 'తీపిగ' సమతీ

ఆ॥ మొలక నవ్వుతోటి మురిపించు ఆ స్వామి
మహిమలన్ని తెలియ మనవశంబె
ఏడుకొండలెక్కి యీతడే గతియన్న
అండ అగును నాకె అనుభవమ్ము



సీ॥ పాడింది పాడరా పాచిపళ్ళతొ 'దాస'
అని వెక్కిరింతురు అధికులమని
హరిదాసు పాడిన ఆ పాచిపాటలే
హరి సన్నిధిని జేర్చు అధికుజేయు
అధికుడు వేదాల నన్నిటివడబోసి
నాడట భళి భళీ అందుచేత
తానహం(బ్రహ్మస్మి తలచును మూర్ఖుడై
అహము వీడక తాను అవునె (బ్రహ్మ

తే॥ ఛాందసులు నన్ను తిట్టిన వందనములు
ఒడలు బలిసిన వోడన్న ఓర్చుకొనెద
పక్షవాతము అందుకే వచ్చెనంచు
తిట్టనే మాయె నిజమిదె దీనబంధు!



కం॥ కలవందురు యోగులయెద
కలవందురు భక్తవరుల గాయకులందు౯
కలవందురణువు అణువున
కలవయ్యా శంకలేల ఘనముగ స్వామీ

ఆ॥ చీరమాసినంత చేకొని ఉతకొచ్చు
చలువ చేసినంత చక్కనగును
మనసు మాసినంత మనిషేమి చేయురా
అమరవాది మాటలవె నిజంబు

ఆ॥ అతివ నొద్ది చెడెను ఆ ధర్మసూనుండు
లలనకోరి చెడెను రావణుండు
ఇంతివాంఛచెడెను ఇం(దుడే ఆనాడు
సత్యవాక్కు వినరె సవివరముగ



మ॥ తెలుపన్ సిగ్గయెదేవ! నీవు వినవే
దీనుండ, నన్‌గావవే
విలువౌ కాలము 'వీధినేసి' యిటునిన్
వేడేరు నాబోంట్లిలన్
తొలినే జేసిన పుణ్యమేమొ తెలిసెన్
తొల్దొల్త నేనెవ్వడన్
వెలుగున్ ఆర్పకు జ్ఞానజ్యోతి ఇదియే
విశ్వేశ్వరా వేడెదన్

ఆ ॥ వినుడు ఏదియగునొ వీడక నియమంబు
నియమముంచువాడు నేతకాడె?
శిక్షలందికూడ శ్రీ హరి నెరుగరే
వానిమాయగాదె వాస్తవముగ

సీ॥ నల్లనివాడట నళినేత్రు డతడంట
కరుణతోముంచెడి ఘనుడెయంట
నెమలిపింఛము దాల్చు నెమ్మదివాడంట
ముఖమున నవ్వులే మొలచునంట
చెలియల మానంబు చిత్తముల్ దోచెడి
దొంగంట మురిపించి దొరకడంట
మల్లియల్నడిగిన మౌనమే తమదైన
భాషంట, పొదలందు వాని యునికి

తే॥ చెప్పవట, యెంత బ్రతిమాలు చెలులకైన
విరహ వేదన వగచుచు విసుగు చూప
స్వామి కరుగునే? అదియెందు సాధ్యపడదు
చేతులెత్తుడు చెలులార! చేరవచ్చు.

25

ఆ॥ చేరి కొల్చునట్టి శిష్య సంఘములున్న
చెప్పగలను నేను శివునిపైన
నాకు తోచినట్లు నాల్గు పురాణాలు
నేనిదంత అనిన నింద బడనె?

ఆ॥ కనులు పొరలు గప్ప గర్వాన కనకుంటి
కనుల నీరు నింద కాంచకుంటి
కనులు రోగమొచ్చి కనబడు రెండుగా
కనులు పోవు కన్న కాదె నయము?

కం॥ వలువల నొగ్గిన చాలును
గలగలమని రాలుధనము కాదనగలరే
విలువలు మారెడి జగమున
వెలవెలనేబోతినయ్య వేంకటనాధా!

26

ఆ॥ ఎన్ని జన్మలెత్తి ఇలనేమి లాభమ్ము
ఎన్నడైన తనను ఎరుగకున్న
బురద దొర్లు పంది పోలిక మానవుల్
అన్ని కోరుచుంద్రు హరినిదక్క

ఆ॥ రాసి కోసమేడ్చి వాసి చూడనివాడు
భంగపడును తుదకు బాధపడును
చెరిచె పొగరు నన్ను శ్రీదక్షిణామూర్తి
స్తవము నింద తప్పు తడకలాయె

కం॥ నీతోడెవ్వరు కారని
నాతో 'వేదాంతి' చెప్పనవ్వొచ్చెనయా
'తాతకు దగ్గులు నేర్పిన'
ఆ తీరున ముసలి నైతి అరవిందాక్షా!

27

సీ॥ సీతమ్మ కానాడు చేయించి, చింతాకు
పతకము గోపన్న బంది ఆయె
హోలికుడైగూడ హరిగాధ తెనిగించి
ధన్యుడై పోతన దయను గాంచె
ప్రీతి రామకథను ఆ తులసీదాసు
పామరుడిని కూడ భక్తుజేసె
గరళము త్రాగుట కడగిన 'మీరయు'
నీ పాటమానదు నియతిజేసి

తే॥ కారుమేఘాలు కమ్మిన గగనమందు
మెరుపుతీగవు నీవని మేలుకొంటి
మరల భ్రమలోన ముంచక మత్తు కలుగ
చింతతీర్చుము నా ప్రభూ శ్రీనివాస

28

ఆ॥ అమ్మ మీద అలుక అన్నంబుపై చూప
కడుపు కాలు తుదకు కష్టమగును
చెరువు మీద అలుక చెరచును మనలనే
సత్యవాక్కు వినరె జరుగునట్లె.

ఆ॥ గానుగెద్దువోలె గడుపు జీవితమంత
అట్టి జన్మవలన అమరునేమి?
ఒక్కనిముషమైన మ్రొక్కకమురవైరి
సత్యవాక్కు వినరె జరుగునట్లె.

కం॥ రొంటిన కట్టిన రూకై
యుంటివి నా అండ నీవు ఓ సర్వేశా
జంటను వీడిన క్షణమును
మంటలొశలభమ్ము వోలె మసియౌదుగదా



ఆ॥ నీరు చేరునెట్లు నేర్పుగ టెంకాయ
కరికి కాన్పుచేయు ఘనుడెవండు
వలస పోవు పక్షి వచ్చు వెన్కకు నెట్లు
స్వామి ఘనత కాదె? సాక్ష్యమేల?

కం॥ నక్కెను ఏ మలుపుననో
టక్కున నను నమిలి మింగ దానవవైరీ!
దిక్కులు తెలియగ నేరకె
చిక్కడినే పోతినయ్య చిట్టడవినినె

కం॥ తెలవారింది లెగండని
తెలుపుటకై దీనినిట్లు తెలుపుదు, కానీ
తెలివింక రాని మూర్ఖుని
తెలివిని మన్నించి వినుడు తెలిపెడిదంతా



ఆ॥ కళ్ళులేనివాడు కమ్మగా పాడును
కాళ్ళులేనివాడు కైతలల్లు
కొడుకు లేనివాడు కోటికి పడగెత్తు
స్వామి లీలతెలియ సాధ్యమగునె.

ఆ॥ సిరులు ఎన్నివుండి నరునకు లాభమే?
వానిగాయలేని వ్యర్థుడయిన
వెట్టివాని భార్య పేటకు వదినట్లు
వానివీడిపోవు వాసుదేవ!

తే॥ మనిషి తనవెంటకొని పోవు మాన్యమేది
తనతొ పుట్టుచు దెచ్చిన ధనములేమి?
ధనము కావలె ప్రాణాలు తనువు నిలువ
పాపమేలయ్య చేయుట పైసకొరకు



ఆ॥ అత్త సొమ్ము తినుచు అనువు నుండెడివాడు
లంజ బెదరగొట్టి లాగువాడు
దాలికుక్క కన్న తగని వాడందురా
సత్యవాక్కు వినరె జరుగునట్లె.

కం॥ కుళ్ళినవని చూడకనె
పళ్ళను దానంబునీయ భాగ్యంబగునే
కళ్ళను గాంచని బిడ్డల
తల్లగురా శంక ఏల తప్పక సమతీ

ఆ॥ చెడ్డ తిండి తినిన చెడును పొట్టొక్కటే
చెడ్డయోచనొచ్చి చెరచు మనసు
చెడిన మనసు తాను చెరచును మనిషినే
చెరచు మనిషి భువిని శేషశయన!

తే॥ రేపు ఏమౌనొ చింతతో రేయి గడుచు
నేడు తినబోడు తిననీడు నీచుడితడు
మనిషి అను జంతు వీతడు మహినిపుట్టి
నీదు ధ్యాసతో మాత్రమే నెగ్గగలడు.

తే॥ తళుకు బెళుకులు చూచిన తగులు తమిని
తరుణి నాశించినశియించు తథ్యమిదియె
తరమె కామము నాపగ దనుజవైరి!
ధరను జనియించు మానవ తామసులకు

కం॥ ఉందయ నీదయ నాపై
ఉందని నానమ్మకమును ఓగోవిందా!
ఉందో లేదో అనియెడి
చందంబు శంక జేసి చంపగనగునే



కం॥ పాటల గొల్చెను క్షేత్రయ
మాటలు కథలౌచు కొలుచు వారలు ఇలలో
కోటికి పైనే మాధవ!
దీటుగ పద్యాల గొల్తు దీనునిగనవే

కం॥ కామము క్రోధము మోహము
రామా! కుడివైపు నుండి రాజ్యముచేయన్
ఏమరక లోభమదములు
ఆమచ్చర మెడమ నుంచి అంతము చేసెన్

ఆ॥ అమ్మచేతిముద్ద ఆవురావురుమని
మెక్కి చేయికొఱుకు కుక్కకెపుడు
మంచికాదు తుదకు మసియౌట నిజమయ్య
సత్యవాక్కు వినుడు జరుగునట్లె



ఆ॥ రాజమార్గమొదలి రాళ్ళదారినబోవు
చెనటిగూర్చి వేరె చెప్పనేల
రాళ్ళదెబ్బలగును కాళ్ళ ముళ్ళున్ దిగు
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

ఆ॥ తిరుమలేశు ధనము తినమరిగినవాడు
చెల్లినైన అమ్మ తల్లినైన
వరదజచ్చినట్టివానినే దోచును
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

ఆ॥ ముక్కుమీదవాలి ఇక్కట్లుపెట్టెడి
ఈగవంటి దయ్య ఇంతిపోరు
చెప్పునున్న రాయి చీకాకు పెట్టదా
సత్యవాక్కు వినుడు జరుగునట్లె



ఆ॥ రాయి రాయి గొట్టి రగిలించ నిప్పును
నిప్పు శక్తినిచ్చె నియతిజేయ
నీతిలేని నరుడు నిప్పెట్టె నన్నింటి
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

ఆ॥ ఆ, కబీరు పాడె అలనాడు రాముపై
పాడె భక్తి కలుగ భాగవతులు
అష్ట పదుల గొల్చె ఆ జయదేవుండు
వ్రాసి కొలుతు సత్యవాణి నేను

ఆ॥ ఆ, హిరణ్యకశిపుడా రావణాబ్రహ్మ
'భస్మ' అసురుడైన వానిగాని
వరములెన్నిగోరి పడలేదెనీ చేత
నిన్ను మించు నెవడు నీరజాక్ష

ఆ॥ భీరుడంటిరయ్య వె(రిదానవులంత
సమయ మెప్పుడగునొ సరిగ తెలిసి
చావు నీయకుండ నీవె పారెదవయ్య
నిన్ను తెలియులోపె నిక్కిరంత

ఆ॥ జాలిలేని వాడు చాల వేత్తయ్యేమి
నీతిలేని సొగసు చేతురేమి
ఉప్పులేకయున్న పప్పును తిందురే
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

తే॥ భక్తి చేతనె సమకూరు పాపముక్తి
భక్తి ఒక్కటే పరమాత్మ బడయుదారి
భక్తి నీశ్వరుపైననే భారమేసి
భక్త కోటికి కొంగునబంగరమవును



తే॥ జాంబవంతుడు కోరెను జరుప 'పోరు'
రామునిగ కాక కృష్ణుడై రణమునందు
వానిమర్ధించి ఆ పైన వాని గాచి
'మామ' పట్టంబు గట్టెను మాధవుండు

కం॥ కక్కిన అన్నంబునకున్
మిక్కుటముగ ఆశ పడుటమేలా కాదే
తక్కువ (బతుకదిమేలా
ఎక్కువధర 'జెప్పు' దెబ్బహితవా సత్యా

తె॥ దాచిగుం(డాయి పెండ్లాప తరమె? కాదు
కోడినాపిన తెలవారకుండుటగునె
మూర్ఖులకు జెప్పలేడు ఆ మురహరైన
సత్యవాక్యము వినరేల జరుగునట్లె.



ఆ॥ గీత బోధ చేసి (క్రీడికి ఆనాడు
అనికి (ప్రోత్సహించె అచ్యుతుండు
సుఖము దు:ఖములను చూడగ సమముగా
చెప్పెదానికన్న (శేష్టమేది

ఆ॥ చావుతప్పదవని జన్మించు జీవికి
వలదు భీతి చావు వలననెపుడు
పాతవ(స్త్రములను వదలిన రీతిగా
దేహములను వీడు దివ్యుడాత్మ

ఆ॥ కర్మమానరాదు కర్తవ్య దీక్షలో
మరణమైనగాని కొరవదేమి
కర్మఫలపు ఆస ఘనులు వీడెదరంచు
బోధచేసె హరియె పుణ్యమలర



ఆ॥ నీ విభూతి చెప్పినీ బావనానాడు
జ్ఞానమిచ్చినావు చక్కగాను
నీవులేనిదెట్టు నెలకొను జగతిని
నీవె ఆది అంత్యమవనికెల్ల

ఆ॥ విశ్వరూపమరయ భీతిల్లెనా(క్రీడి
చేరదీసి వాని సేదతీర్చి
నిన్ను శరణు వేడ నీచతుర్భుజరూపు
నాడు చూపినావు నళిననాభ!

ఆ॥ అమ్మవంటి దైవమవనిని గనలేము
(బతుకునిచ్చు, పెంచు 'పాలు' పోసి
ఆదిగురువు తల్లి ఆమెనే మరచిన
వానితలువనేల వ్యర్థమగును.

ఆ॥ అరయలేదు 'నలుపు' గురివిందగింజని
అనుట ఎంత నిజము అవనియందు
ఎవరి'నలుపు' వారు ఎరుగరె వింతగా
సత్యవాక్కు వినుడు జరుగునట్లె

ఉ॥ తాండవమాడి కాళియుని తన్నిన కృష్ణుని
ఎన్నకుంటి, నా
కండగ నుండి బ్రోచుటకు అన్యుల కొల్వను
ఎన్నడేనియున్
పండెను పుణ్యమిప్పటికి బాధలు తీరును
ఏలశంకనిన్
మెండుగ గొల్చువారలకు మిన్నక ఉండగ
నేల భావ్యమే?

41

సీ॥ కాళ్ళు కదపలేని కడజాతి వాడిని
కరుణతో దరిజేరి కౌగలించు
చేయిమెదపలేని చిన్నారులకు కూడ
చేయూతనందించి సేదదీర్చు
కళ్ళుబోయిన వృద్ధగాయకునకు వాడె
కర్రయై వెంటుండి గమ్యమొసగు
బదిరుల కాపదల్ పలుమార్లు తప్పించు
బంధువు దెవడయ్య పద్మనాభ

తే ॥ నీవు మాముందె తిరిగినా, నిలిచియున్న
నిన్నుకనలేము గుర్తించి ఎన్నడైన
నిందజేతుము దొంగని నిన్ను మేము
మాతొ ఈ ఆట న్యాయమా మధువిరోధి!

42

చం॥ చతురత కల్గు వారలకు సాధ్యము మేడల
పెక్కుగట్టగా
మితియదిలేని దుష్టులిల మించిరి దోచిరి
మేదినంతటిన్
అతిబలశాలి సర్పమది యైనను చీమల
జచ్చు నట్టుగా
క్షితితము వీడకుండుదురె 'చేర పెద్దల'
శ్యామసుందరా!

శా॥ మేలే పెద్దల నింద చేయుటదియే
మీ నీచమున్ జూపుగా
ఏలా వాదము హీనులందరినిలన్
ఈ తీరుమార్చంగ, మా
వీలా గాడిద కెన్న నేర్పగనరే
వేదాలు సంగీతముల్
చాలీ యాతన చేరిగొల్వ హరియే
సౌహార్ద్రమున్ పెంచురా

43

ఆ॥ నల్లికైనగాని పిల్లికైనను గాని
బల్లికైనగాని తల్లిఎవరు
తల్లి తండ్రి గురువు దాతయు శ్రీహరే
ఎల్లవేళలందు ఇది నిజంబు

ఆ॥ శివుడె పోరవచ్చె చేరుచుబాణుని
కృష్ణుడెత్తివచ్చె కావతనదు
మనుమడైన బాల అనిరుద్ధుడు, ఉషను
పెండ్లియాడనెంచి పేర్మిజేయ

ఆ॥ చంకబెట్టి తిరుగు చావును మనుజుండు
చంకనుండు వరకు చావురాదు
చంకజారినంత చంపును కబళించి
వేంకటేశు వేడ వెరపు రాదు

44

ఆ॥ తెలుగు ఉండువరకు తెలియును పోతన
వానిమించు వారు వందలున్న
హరి నుతించి పాడినందుకే అటులయ్యె
శంకలేక గనుడు శౌరినిపుడె

ఉ॥ చేసిన పుణ్యమేమొకద, చింతన నిచ్చితివయ్య నీవయిన్
చేసిన పూజలేమొ యవి జీవిక సాగుకు లోటు లేదు,నే
చేసిన మంచి ఏమొ ఇట చేతురుమన్నన పెద్దలందరు
చేసిన నేరమేమొ హరి! ఛీ అనిపించెడి యాతనిస్తివే



కం॥ కాంతలు చెంతనె వున్నను
కాంతురె ఏకాంతమైన గాంతురె, తము శ్రీ
కాంతుని చింతన బట్టిన
కాంతారమునున్న వంత కాంతురె భక్తుల్

తరళము :
కలలు కంటిని ఎన్నియో నినుగాంచ తత్తరజెందితిన్
నిలువనీయవు నిద్రనీయవు నిన్ను ఏమని అందురా
తలచినిన్నొక సారివేడిన తక్షణంబుగ వత్తువే
తలపు రాదొకొ నిన్ను చేరెడి దారి జూపగమాధవా!



**ద్విపద॥**

హరిని గొల్చుట కన్న అవునేమి ఘనము
హరిని గొల్వకనేమి అయిన లాభమ్మె

వినిపింతు హరిగూర్చి వినుడు యెల్లరును
కనిపించదేనాడు కనులకు మనకు

శరణన్న విడువడు చక్కగా గాచు
నిరతమ్ము నామాట నిజమయ్య వినుడు

నీడలావెంటుండి నిన్నుగాపాడు
కూడునవాధులన్ కురిపించు దయను

ఆలస్యమేగాని అలసత్వమెపుడు
ఆ లక్ష్మికాంతుని అండలోలేదు

ఇదినిజం కాకున్న ఇన్నాళ్ళు భువిని
మది గొల్తురే వాని మానక నరులు



## మంగళం

మంగళంబగు నమ్మ వాణికి మంగళంబు గణేశుకున్

మంగళంబగు అంబుజోద్భవిమాత లక్ష్మికి యెల్లెడన్

మంగళంబగు మంచిపెంచిన మట్టుబెట్టిన చెడ్డనూ

మంగళంబగు గాక ఎల్లరు మానవాళికి ఎల్లెడన్